# నా తప్పేంటి నాన్నా

"నాన్నా! అమ్మ మళ్లీ నన్ను కొట్టింది. వాతలు పెడతానంది. రే పొద్దున అట్లు వేసిం తర్వాత అట్లకాడతో పెడతానంది. దెబ్బకు చస్తావంది. చచ్చిపోతే ఎట్లాగ? మా హెడ్ మాస్టారుగారంత గొప్పవాణ్ణి ఎట్లా అవుతాను? వివేకానంద స్వామి లాగా అమెరికా ఎట్లా వెడతాను? నా కష్టలు చచ్చిపోవాలని లేదు. మనం తప్పు చేస్తే వెంటనే ఒప్పుకోవాలని మా హెడ్ మాస్టారు చెప్పారు. ఒప్పుకోకపోతే అది ఇంకో తప్పవుతుందని చెప్పారు. నేనేం చెయ్యకుండానే తమ్ముడు నన్ను కొట్టాడు. 'తప్పూ, కొట్టకూడదురా' అని చెబితే మళ్లీ కొట్టాడు. వాడికేం తలీదనుకో. మరి నేవెళ్లి అమ్మకి చెబితే అమ్మనన్నెందుక్కొట్టింది? వాతలు పెడతానంది. నా తప్పేంటి నాన్నా?

"అస్సలు - వాడి మాట ఒప్పుకోలేదని తమ్ముడు నన్ను రోజూ కొడుతున్నాడు తెలుసా? సంక్రాంతి పండగప్పట్నించీ కొడుతున్నాడు. ఆ రోజు నువ్వు ఊరెళ్లావు. అందుకని కూరలు తేవటానికి నేనూ, తమ్ముడూ మార్కెట్టు కెళ్లాం. అక్కడ తాతయ్యగారూ, మామ్మగారూ కనిపించారు. ఇద్దరూ కూర్చుని కూరలు పంచుకుంటున్నారు. అల్లం, కరివేపాకు కూడా పంచుకున్నారు. పచ్చిమిరపకాయలు అసలు కొనలేదు. అప్పుడు తాతగారు మామ్మగారిని 'ఏమే ముసిలీ! అర్థరూపాయి ఉంటే ఇస్తావూ? మిరపకాయలు కొనుక్కెళ్లకపోతే చిన్నాడు ఊరుకోడు'. అనడిగారు.

"మామ్మగారు బొడ్లోంచి పైసలు తీసి కళ్ల దగ్గర పెట్టుకొని చూసి లెక్కపెట్టి లెక్కపెట్టి 'అయ్యో సరిగ్గా అర్థరూపాయి డబ్బులే ఉన్నయ్యండి. నాకు బస్సుకు సరిపోతయ్యి. ఎట్లా?' అంది.

"తాతగారు - 'రేట్లు పెరిగాయి. డబ్బులు చాల్లేదు. మిరపకాయలు కొనలేదు- అని చెబితే చిన్నాడు నమ్మడే! ఆ ముసలిముండ మొహాన పెట్టావా అని మీద పడి కరుస్తాడు. ఎట్లాగే?' అన్నారు. అప్పుడు మామ్మగారు 'పోనీ నా మిరపకాయ లిద్దామంటే బుల్లాడు నన్ను మిరపకాయలు కొనమని చెప్పలేదు. కొనిద్దామంటే నా దగ్గర కూడా డబ్బులు మిగల్లేదు. ఎట్లాగండీ? అది సరే గాని మీ దగ్గర డబ్బు ల్లేవు గదా, ఇప్పుడు బస్సు ఎట్లా ఎక్కుతారు. పోనీ నా అర్థరూపాయి తీసుకోండి. నేను నడిచెడతాన్లెండి?' అన్నారు. 'వద్దే నీకసలే చూపు ఆనదు. నా ఏడుపేదో నేను ఏడుస్తాన్లే' అన్నారు తాతగారు. 'మీరు మాత్రం నడవగలరా? కదిల్తేనే గుండె దడ. ఎప్పుడెక్కడ పడిపోతారో, ఏం వార్త వినవలసొస్తుందో అని నాకు పుట్టెడు దిగులు. పోనీ, ఇద్దరం నడిచి మీ చిన్నాడింటికెళ్లి మిరపకాయలికి, డబ్బులు చాల్లేదని చెబుదాం. అక్కడ్నించి నేను మనబుల్లాడింటికి నడవగలను లెండి' అన్నారు మామ్మగారు.

'ఒద్దే ఒద్దు ఒద్దు! చిన్నాడు నిన్ను ఆడిపోసుకోని రోజు లేదు. నిన్ను తిట్టని తిట్టులేదు. నువు వాడి గుమ్మం ఎక్కితే సహించగలడా? పీక పిసికినా ఆశ్చర్యం లేదు' అన్నారు తాతగారు. అప్పుడు మామ్మగారికి ఏడు పొచ్చింది. ఆవిడ 'పొన్లెండి. అదే సుఖం! కన్న కొడుకు చేతుల్లో పసుపు కుంకుమల్తో చావటం కన్నా అదృష్టం ఏముంది?' అన్నారు. చిరుగుల చీరెతో కళ్లు తుడుచుకున్నారు. మళ్లీ ఏడ్చారు. అప్పుడు తాతగారు 'నువ్వు చచ్చిపోతే నే నెలా బతగ్గలనే? నలభయేళ్లు కలిసి బతికాం. ఇపుడు నువ్వు లేకుండా నా కెల్లాగే? ఇప్పుడు ఇక్కడ మార్కెట్టులో నయినా కలిసి ఒకళ్ల నొకళ్లం చూసుకుంటూ

బతుకుతున్నాం. అదీ లేకపోతే నేనెట్లా బతకనే? ఏ నుయ్యో గొయ్యే చూసుకోటమేనే నా పని' అన్నారు. ఏడ్చారు ఇద్దరూ కొంచెం సన్నగా ఏడ్చారు. అప్పుడు నేనూ, తమ్ముడూ వెళ్ళాం. మన తాతగారికి నేను మిరపకాయలు కొనిచ్చాను. ఆతర్వాత వాళ్ళిద్దర్నీ జాగ్రత్తగా నడిపించుకుంటూ బస్సు స్టాపుకు తీసుకెళ్లాం. తాతగారికి టిక్కెట్టు కొనిచ్చి చిన బాబాయి ఇంటికి రెండో నంబరు బస్సూ, మామ్మగార్ని బుల్లి బాబాయి ఇంటికి మూడో నబరు బస్సూ ఎక్కించాము. కూరలు తీసుకుని నేనూ, తమ్ముడూ మనింటి కొచ్చేశాం.

"అమ్మతో నేనూ, తమ్ముడూ అంతా చెప్పాం. అమ్మ ఆ ముసలాళ్లతో మేం మళ్లీ మాట్లాడితే గొంతు పిసికేస్తానని భయపెట్టింది. తాతగారు తన ఉద్యోగం డబ్బంతా చిన్న బాబాయికి ఇచ్చార్ట కదా! అందుకని చిన్న బాబాయి తాతగారి కొక్కరికే అన్నం పెడతానన్నాట్ట. మామ్మగారు తన చంద్రహారం బుల్లి బాబాయికి ఇచ్చార్ట. అందుకని బాబాయి మామ్మగారికే అన్నం పెడతానన్నాట్ట. తాతగారూ, మామ్మగారు మన కనలేం ఇవ్వలేదట. అందుకని సిగ్గుపడి వాళ్లిద్దరూ మనింటికి రావటం మానేశార్ట. అమ్మ చెప్పింది. నిజమేనా, నాన్నా? అప్పుడు అమ్మతోటి నేను 'మరి వాళ్లిద్దరూ విడిపోయారు గదమ్మా, అందుకనే గదే ఏడుస్తున్నారు. పాపం! మనం రమ్మందామే' అన్నాను. 'రమ్మంటావా? గొప్పవాడివే! మనకి వాళ్లేం ఇచ్చారని రమ్మంటావ్? డబ్బులూ, బంగారాలూ కాజేసిన మీ బాబాయిలే వాళ్లని కలిపి పోషించలేక విడివిడిగా పోషిస్తున్నారు. అసలేమీ దక్కని మనం ఒక్కరినయినా ఎలా పోషించగలం?' అంది అమ్మ. అప్పుడు నేను 'మరయితే, ఈ ఇల్లు తాతగారిచ్చిందే గదే!' అన్నాను.

అమ్మ కోపంగా "ఏంటీ, ఇల్లిచ్చారా? ముష్టి పాత ఇల్లు! ఇందులో ఏముంది మట్టే పెంకులు తప్ప! అయినా లంకెబిందె లిచ్చినట్టు. సపోర్టు చేస్తున్నావే? నోరు మూసుకో వెధవా!' అంది. నా కేంటో అర్థం కాలేదు. అయినా మళ్లీ నేను 'బాబాయిలు ఎప్పుడయినా వాళ్లిద్దర్నీ వెళ్లగొడితే ఎక్కడి కెడతారే మరి?' అన్నాను. 'ఏమో, ఎక్కడి కెడితే మనకెందుకు? నీ బొక్కాపాత దయిపోతే స్టీలు గిన్నెల వాడికి అమ్మేస్తున్నాం. అదెక్కడి కెడుతుందో తెలుసా? మన దొడ్లో గేదెలు ముసలి వయిపోతే అమ్మేస్తున్నాం. అవెక్కడికి పోతున్నాయో తెలుసా? వాళ్ళూ అంతే?' అంది అమ్మ. 'మనం అమ్మకుండా ఉంటే ముసలి గేదెలు మన దొడ్లోనే ఉంటాయి గదామ్మా!' అన్నాన్నేను. 'ఉండవ్ అవ్వే ఎటో పోతాయి. ఆ ముసలి పీనుగలు కూడా అంతే! ఎటో పోవాలి. డబ్బూ, బంగారమూ ఆ కొడుకులకు దోచి పెట్టినప్పుడు తెలీదా ఎటు పోవాలో? తెలుసు. పోతారు' అంది అమ్మ.

'నాకూ, తమ్ముడికీ ఆరోజు అన్నం సయించలేదు నాన్నా? ఆ తర్వాత ఒక రోజు రాత్రి మంచంమీద పడుకున్నప్పుడు తమ్ముడు నాతో 'ఒరేయి అన్నయ్యా! మన అమ్మా, నాన్నా కూడా ముసలాళ్లయ్యాక ఎక్కడికయినా వెళ్లిపోతారా' అనడిగాడు. 'ఆ వెళ్లిపోతారు.' అన్నాను. 'తమ్ముడు ఏడ్చాడు. నాకూ ఏడు పొచ్చింది. ఇద్దరం ఏడ్చాం 'పోనీ ఓ పని చేద్దాం రా అన్నయ్యా! అప్పుడు నేను పెద్దాణ్ణవుతాను గదా, అమ్మను నాదగ్గరుంచుకుంట్రానా, నాన్నని నీదగ్గరుంచుకో. అప్పుడు వాళ్లు వెళ్లిపోరు' అన్నాడు తమ్ముడు.

"నా క్కోపం వచ్చింది 'నేనే అమ్మను ఉంచుకుంటాను. నాన్ననే నువ్వు ఉంచుకో అన్నాను. కాదు - అన్నాడు తమ్ముడు. కాదు- అన్నాను నేను తమ్ముడు నన్ను కొట్టాడు. నేను ఏడ్చాను. అమ్మ గదిలోంచి నిద్ర లేచొచ్చి -

"పెద్ద వెధవ్వి బుద్ధిలేదూ. తెలీక తమ్ముడేదో వాగితే వాడికి తప్పుని చెప్పక్కర్లేదా?" అంది. నన్ను

కొట్టింది. 'నా తప్పేంటి నాన్నా. అమ్మని నే నుంచుకుంటా ననటం తప్పా? నిన్ను అడుగుదామనుకుంటే నువ్వు కాంపు కెళ్లావు. అమ్మని నే నుంచుకుంటానని అనటం తప్పని ఆ తర్వాత నాకు తెలిసిపోయింది అందుకని ఇవ్వాళ సాయంత్రం తమ్ముడితో నేను 'ఒరేయి తమ్ముడూ, నా తప్పు తెలిసిందిరా. అమ్మని నువ్వే వుంచుకో. నాన్నని నేనుంచుకుంటాను లేరా' అన్నాను. కానీ వాడు మాట మారిపోయాడు. 'కాదు నాన్నే నాకు కావాలి' అన్నాడు. 'తప్పురా, కొట్టకూడదు. పోన్లే నీమాటే వింటాను. నాన్ననే నువ్వు తీసుకో' అన్నాను. అయినా మళ్లీ కొట్టాడు. నే నెళ్లి అమ్మకి చెప్పాను. అమ్మ తమ్ముణ్ణి రెండు దెబ్బలు కొట్టింది వాడు డాబా మీదకు పారిపోయాడు.

"అమ్మ నన్ను మాత్రం బాగా కొట్టింది. 'వెధవల్లారా! బతికుండగానే మమ్మల్ని పంచుకుంటార్రా? అయినా ఆ బాబాయిల బుద్ధులే రావాలా మీకు, వెధవ బుద్ధులు! వాడికి లేకపోతే పెద్ద గాడిదవి నీ కుండక్కర్లా జ్ఞానం? నువ్వు పాడయింది కాకుండా వాణ్ణి కూడా పాడుచేస్తున్నావా? ఉండు. పొద్దున్నే నీకు అట్లకాడతో వాతలు పెట్టకపోతె చూడు! దెబ్బకి చచ్చూరుకుంటావ్? ముదనష్టపు వెధవా!' అంది.

"నా తప్పేంటి నాన్నా? నిన్ను ఉంచుకుంటా ననటం కూడా తప్పేనా నాన్నా?"

"ముసలా ళ్లయ్యాక అమ్మా, నువ్వూ ఎటో వెళ్లిపోతే మేము ఏమయిపోతాం. అందుకని పంచుకోవా లనుకున్నాం. నేనూ, తమ్ముడూ ఒప్పుకుంటున్నాంగా! అమ్మ కెందుకు కోపం? వాతలు పెడితే నేను చచ్చిపోతానందిగా అమ్మ కెందుకు కోపం? అందుకనే నేను ఎటో వెళ్లిపోతున్నాను. తమ్ముడు కూడా వెళ్లిపోతాట్ట. ఈ రాత్రి అమ్మ దగ్గర పడుకుని పొద్దున్నే కాఫీ తాగాక వెళ్లిపోతాట్ట, ఇప్పుడు నాతో రా నన్నాడు

"అమ్మ తమ్ముడికి వాతలు పెడుతుందేమో, పెట్టొద్దని చెప్పవూ ! పాపం వాడి కసలేం తెలీదు!

ఇట్లు

నాన్నకు పెద్ద కొడుకు."

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 16-10-91)

* * *   * * *   * * *

# సై.. సై... సై..

" నీ పేరు విన్నా, నీ రూపు కన్నా ఉయ్యాల లూగు మది సైసైసై! నాకంట పడుతూ అందనివాడూ నీవని మనసూ వ్యధ చెందేనే, నీవైపు గాలీ నావైపు సోకీ ఉల్లాసమగు మది సైసైసై!"

పాతకేళ్ళ ధీరజాత వాకిట్లో ప్రహరీగోడ పక్కగా ఉన్నే సన్నజాజి పందిరి దగ్గర పూలు కోస్తూ సన్నగా కూనిరాగం తీస్తోంది

వాళ్లింట్లోనే పురోవైపు వాటాలో అద్దెకుంటున్న ఇంకో పాతికేళ్ళ యువకుడు జవనత్వం అదే సమయంలో గదిలో పేపరు చదువుకొంటూ కిటికీ లోంచి ధీరజాతను చూస్తున్నాడు. చూసి చూసి ఫక్కుమని నవ్వాడు. ధీరజాత కూడా అతన్ని చూసింది కిసుక్కుమంది. " పాట మారింది. కానీ మీ